క్లుప్తంగా

పిచ్చిమొక్కల తొలగింపు



జంగిల్ తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న ఈవోఆర్డీ రమేష్‌నాయుడు

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 16న ఫార్మాసిటీకి వస్తున్న తరుణంలో లంకెలపాలెం-బొట్టవానిపాలెం రహదారిలో పెరిగిన ముళ్ల పొదలను పంచాయతీ అధికారులు తొలగిస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాల మేరకు ఈవోఆర్డీ రమేష్‌నాయుడు పర్యవేక్షణలో జంగిల్ తొలగింపు కార్యక్రమం శనివారం నుంచి చురుగ్గా సాగుతోంది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం : చక్రధర్‌పూర్ డివిజన్, రూర్కెలా స్టేషన్ పరిధిలో జరుగుతున్న భద్రత పనుల నిమిత్తం సోమవారం(ఈ నెల 16వ తేదీ) జగదల్‌పూర్-రూర్కెలా(18108) ఎక్స్‌ప్రెస్, గుణుపూర్ -రూర్కెలా(18118) రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు.

ప్రయోగాత్మక హాల్ట్

ప్రయాణికుల సౌకర్యార్థం రూర్కెలా-జగదల్‌పూర్-రూర్కెలా(18107/18108) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 16వ తేదీ నుంచి బ్రహ్మా స్టేషన్‌లో ప్రయోగాత్మక హాల్ట్ కల్పిస్తున్నట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

నేడు బెంగళూరు-హతియా వన్ వే స్పెషల్

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎస్ఎంవీ బెంగళూరు-హతియా(06503) వన్ వే స్పెషల్‌ను నడుపుతున్నారు. ఈ రైలు బెంగళూరులో ఆదివారం ఉదయం 8.50 గంటలకు బయల్దేరి అదే రోజు అర్ధరాత్రి 2.35 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 2.40 గంటలకు బయల్దేరి సోమవారం సాయంత్రం 5.45 గంటలకు హతియా చేరుకుంటుంది.

కృష్ణా కళాశాల అధ్యాపకుడు 'పోలా'కు ప్రధాని ప్రశంస



ఉమామహేశ్వరరావు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంస్కృతం అధ్యాపకుడు డాక్టర్ పోలా ఉమా మహేశ్వరరావు ప్రధానమంతి నరేంద్ర మోదీ నుంచి ప్రశంసలు అందుకున్నారు. పరీక్షా పే చర్చ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు తగు సూచన లు చేసినందుకు పోలాను ప్రధాని అభినంది స్తూ కళాశాలకు ప్రశంసా పత్రాన్ని పంపించారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. 'మీ భాగస్వామ్యం మీ పిల్లల భవిష్యత్తు పట్ల మాత్రమే కాకుండా మన యువతరం ఎదుర్కొంటున్న సమస్యల పట్ల మీ చిత్తశుద్ధి ప్రతిబింబిస్తుంది'అని ప్రశంస పత్రంలో పేర్కొ న్నారు. ఉమామహేశ్వరరావును అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా హిందీ పక్షోత్సవాలు



రాజభాషా పురస్కారాలను అందజేస్తున్న రియర్ అడ్మిరల్ మనీష్ శర్మ

సింధియా: తూర్పు నావికాదళ సాముద్రిక ఆడిటోరియంలో శనివారం హిందీ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నావికా హెడ్ క్వార్టర్స్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్(ఆపరేషన్స్) రియర్ అడ్మిరల్ మనీష్‌శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని వార్షిక హిందీ మ్యాగజైన్ పూర్వివాణి 29వ ఎడిషన్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందీ భాష, సంస్కృతిని ప్రోత్సహించడంలో పూర్విశాణి మ్యాగజైన్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అనంతరం హిందీలో అధికారిక కార్యక్రమాలను నిర్వహించడంలో విశేష కృషి చేసిన వివిధ యూనిట్లకు రాజభాషా పురస్కారాలు అందజేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు వేళాయె

- ముస్తాబైన ఆలయాలు
- పలు ప్రాంతాల్లో భారీ సెట్టింగ్‌లు
- విద్యుత్ కాంతుల్లో వీధులు



దుర్గమాంబ అమ్మవారు



శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన సబ్బవరం దుర్గమాంబ ఆలయం

సబ్బవరం: శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. కనకదుర్గాదేవిని కొలువుదీర్చేందుకు అనువుగా పలు ప్రాంతాల్లో మండపాలను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఈ నెల 15 నుంచి 24 వరకు ప్రత్యేక పూజలు చేసేందుకు మండలంలోని పలు ప్రాంతాల్లో ఆయా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తి చేశాయి.

సబ్బవరం దుర్గమాంబ ఆలయంలో..

మండల కేంద్రం సబ్బవరంలోని శ్రీదుర్గమాంబ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అమ్మవారి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి శోభాయమానంగా ముస్తాబు చేశారు. అమ్మవారికి ప్రతి రోజు ఉదయం,సాయంత్రం కుంకమ పూజలు,సహస్రనామార్చనలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

దేవీపురంలో..

ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని శ్రీ సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠంలో ఈ నెల 15 నుంచి 28వ తేదీ వరకూ దసరా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గురుమాత అన్నపూర్ణమ్మ శనివారం తెలిపారు. ఏటా ఆశ్వీయజ శుద్ద ఏకాదశి నుంచి పౌర్ణమి వరకూ 14 రోజుల పాటు ఈ దసరా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.మహాకాళీ,మహాలక్ష్మి, మహా సరస్వతీ దేవతల సమష్టి స్వరూపిణి అయిన శ్రీచండీగా అమ్మవారిని దసరా బ్రహ్మోత్సవాల్లో కొలిచే భాగ్యం దేవీపురంలో భక్తులకు కలుగుతుందన్నారు.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి క్షీరాభిషేకం,కుంకుమ పూజలు,హోమాలు నిర్వహిస్తారు.
- లలితా సహస్ర నామావళి పారాయణం,దుర్గా సప్తశతి పారాయణం, దేవీ అథర్వశీర్షం పారాయణం,ఖడ్గాది పంచాదశ మాల పారాయణం నిర్వహిస్తారన్నారు.
- ఈ నెల 22న విశేష సేవలైన లలితా సహస్ర నామావళితో కుంకుమార్చన, చండీ సప్తశతి పారాయణ,ఈ నెల 28న దేవీ కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.



దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీ అమ్మవారు



పరవాడలో దుర్గాదేవి మండపం వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

సీఎం పర్యటనకు పక్కా ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి గుడివాడ, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి శనివారం పరిశీలించారు. ఫార్మాసిటీలో ఏర్పాటు చేస్తున్న హెలీ ప్యాడ్ నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. హెలీప్యాడ్ నుంచి నేరుగా సీఎం వైఎస్ జగన్ యుజియా పరిశ్రమకు వెళ్లే మార్గాన్ని పరిశీలించారు. సీఎం భద్రత ఏర్పాట్లపై అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణతో చర్చించారు. జాయింట్ కలెక్టర్ జాహ్నవి, అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, ఆర్డీవో చిన్నికృష్ణ, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, పరవాడ తహసీల్దారు పి.కనకారావు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



దుర్గమాంబ గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న గ్రామ పెద్దలు పైలశ్రీనివాసరావు తదితరులు

పరవాడ: స్థానిక బొంకుల దిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శరన్నవరాత్రుల పోస్టర్‌ను శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆదివారం దుర్గమాంబను ప్రతిష్టించి లక్ష దీపారాధన, కలశ పూజలు ఉంటాయని చెప్పారు. 9 రోజుల పాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 21న మండపం ఆవరణలో భారీ అన్నసమారాధన, 22న మెగా డ్యాన్స్ హంగామా ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, వెన్నలపాలెం సర్పంచ్ వి.అప్పారావు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు, పెద్ద చెరువు ఆయకట్టు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు పైల హరీష్ పాల్గొన్నారు.

ఫార్మా ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గనిశెట్టి

పరవాడ: పరవాడ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల 16న ఫార్మాసిటీలో నూతన పరిశ్రమ ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యలు తీసుకువెళ్లనున్నట్లు గనిశెట్టి చెప్పారు. భద్రత ప్రమాణాల మెరుగు, కనీస వేతనాలు అమలు, పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉపాధి అవకాశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పనపై సీఎం దృష్టి సారించాలని గనిశెట్టి కోరారు. సమావేశంలో నాయకులు ఆర్.శంకర్రావు, వి.వి.రమణ, వి.వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంచ గ్రామాల భూ సమస్య పరిష్కరించాలని పాదయాత్ర

సింహాచలం: పంచగ్రామాల భూ సమస్య పరిష్కరించాలని కోరుతూ సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం పురుషోత్తపురం నుంచి గోపాలపట్నం పెట్రోల్ బంకు వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు మాట్లాడుతూ 26 ఏళ్ల నుంచి భూ సమస్యతో పంచగ్రామాల నిర్వాసితులు బాధలు పడుతున్నారన్నారు. కనీసం ఇళ్ల రిపేర్లు కూడా చేసుకోని దుస్థితి నెలకుందని వాపోయారు. భూసమస్య పరిష్కరిస్తామని హామీలు కురిపిస్తూ అధికారంలోకి వచ్చిన పార్టీలన్నీ ఆ తర్వాత మిన్నకుండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సా ర్ సీపీ ప్రభుత్వం కూడా భూమస్య పరిష్కారం చేస్తామంటూ మూడుసార్లు కమిటీలు వేసినా సమస్య ఇప్పటి వరకు పరిష్కారం కాలేదన్నారు. ఈనెల 16న విశాఖ వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంచగ్రామాల భూసమస్యపై మాట్లాడాలని కోరారు.

వైభవంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు నిత్యకల్యాణం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడ సేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేశారు. అష్టోత్తరం పూజ నిర్వహించి భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

భైరవస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు



భైరవస్వామి



భైరవస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సింహాచలం: అమావాస్యను పురస్కరించుకుని భైరవవాకలోని భైరవస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాలు, ఒడిశా రాష్ట్రం నుంచి భక్తులు తరలిరావడంతో విసాయంత్రం 6గంటల వరకు రద్దీ నెలకుంది. స్వామికి అమృత కలశాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. విభూదితో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున దీపారాధన చేశారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. స్వామివారి దర్శనానికి భక్తులు క్యూల్లో బారులు తీరారు.

పోలీసుల అదుపులో ఏడుగురు పేకాటరాయుళ్లు

కూర్మన్నపాలెం: బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 27,280 రూపాయల నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని దువ్వాడ పోలీసులకు అప్పగించారు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి.. రాజీవ్‌నగర్ సమీప యాతపాలెంలో జనసంచారం లేని బహిరంగ ప్రదేశంలో పేకాటడుతున్నారనే సమాచారం మేరకు ఏసీపీ త్రినాథ్ ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రాధాకృష్ణ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ చేసే వరకూ పోరాటం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సబ్బవరం: ఎస్సీ వర్గీకరణ చేసే వరకూ మాదిగల పోరాటం కొనసాగుతుందని మాదిగ పోరాట సమితి ఉత్తర కోస్తాంధ్ర ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన సుబ్బారావు మాదిగ అన్నారు.మండలంలోని అమ్మరపినివానిపాలెంలో అనకాపల్లి జిల్లా మాదిగ పోరాట సమితి అధ్యక్షుడు గొటివాడ సామ్రాట్ కుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మాదిగల మహా సంగ్రామ పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలు ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చినసుబ్బారావు మాట్లాడుతూ 29 సంవత్సరాలుగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీలను ఏబీసీడీగా వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేస్తున్నాయన్నారు. రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా హైదరాబాద్‌లో జరగబోవు విశ్వరూప మహాసభకు ప్రతి మాదిగ బిడ్డ రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోస్తాంధ్ర ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి టి. శ్రీనివాసరావు, కొల్లి అప్పారావు, గాటీలు,దువ్వి దుర్గాలు, గొటివాడ సన్యాసి,ఇండుగుబల్లి గోపి, బొర్రా జయరాజు, పెట్ల దుర్గాలు పాల్గొన్నారు.

ఆత్మనిర్భర్ భారత్ వైపు పురోగమించాలి

- డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావు
- ఎన్ఎస్‌టీఎల్‌లో ముగిసిన శిక్షణ తరగతులు



కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్ శ్రీనివాసరావు తదితరులు

గోపాలపట్నం: పరిశ్రమ 4.0 కాన్సెప్ట్‌ను అనుసరించి ఆత్మనిర్భర్ భారత్ వైపు పురోగమించాలని విశిష్ట శాస్త్రవేత్త డీఆర్‌డీవో డైరెక్టర్ జనరల్(నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్) వై.శ్రీనివాసరావు అన్నారు. ఎన్ఎస్‌టీఎల్‌లో పరిశ్రమ 4.0 కాన్సెప్ట్ అప్లికేషన్స్‌పై ఐదు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీవో, దేశాభివృద్ధి కోసం ఉద్యోగులంతా ఆధునిక నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలన్నారు. ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ క్రమ పద్ధతిలో ప్రాజెక్టు పూర్తికి పరిశ్రమ 4.0 దోహదపడుతుందన్నారు. అత్యంత ప్రయోజనకరమైన ఈ కోర్సులో స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్, అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్, రోబోటిక్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అగ్‌మెంటెడ్ రియాలిటీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త, ఎఫ్ కోర్సు డైరెక్టర్ ఎస్.మధుకిరణ్, శాస్త్రవేత్త, జీ టెక్నాలజీ డైరెక్టర్ కేదార్‌నాథ్, ఐఐటీ, పలు వర్సిటీలు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

విశేషంగా అమావాస్య తిరువీధి



తిరువీధిలో పల్లకి మోస్తున్న దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: అమావాస్య పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తిరువీధి విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అలంకరించి పల్లకిలో అదిష్టంపజేశారు. సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి స్వామివారి పల్లకీని మోసారు.

కార్మికుల జీతాలు చెల్లించాలి

గాజువాక: మలేరియా విభాగంలో పని చేస్తున్న కార్మికులకు జీతాలను వెంటనే చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గాజువాక ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు డిమాండ్ చేశారు. మలేరియా కార్మికులతో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మలేరియా కార్మికులకు ఏడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని, దీనివల్ల వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని పేర్కొన్నారు. ఆప్కోసలో విలీనం కాకముందు జీతాల బకాయిలు కూడా ఇప్పటివరకు చెల్లించకపోవడం దారుణమన్నారు.

విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతి వెలిగించాలి

ఆర్‌జేడీ జ్యోతికుమారి



శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్‌జేడీ జ్యోతి కుమారి

అక్కిరెడ్డిపాలెం: విద్యార్థుల జీవితాల్లో జ్ఞానజ్యోతి వెలిగించాలని విద్యాశాఖ ఆర్‌జేడీ ఎం.జ్యోతి కుమారి కోరారు. చిన్నారుల సమగ్ర వికాసానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖలో పని చేస్తున్న చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 120 రోజుల పాటు నిర్వహించిన జ్ఞాన జ్యోతి రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా షీలానగర్‌లోని మిలీనియం స్కిల్ డెవలప్‌మెంట్ ట్రెనింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్జేడీ మాట్లాడారు. మూడు నుంచి ఎనిమిది సంవత్సరాల వయసు గల పిల్లలందరూ తప్పకుండా చదవడం, రాయడం తదితర చతుర్విధ ప్రక్రియలను చేయగలిగేలా చేయడం శిక్షణ ముఖ్య ఉద్దేశమని వివరించారు. శిక్షణలో పాల్గొన్న ప్రతీ ఒక్కరు మండల స్థాయిలో జరిగే శిక్షణ కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లకు, ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చి, క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని కోరారు.

బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి

సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యంపై, విద్యపై పూర్వ ప్రాథమిక దశ నుంచి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అంగన్‌వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ రాష్ట్ర పరిశీలకుడు పైడి వెంకటరావు, భీమిలి డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, అకాడమీ మానిటరింగ్ అధికారి డాక్టర్ జి.లక్ష్మి, కోనసీమ ఏఎంవో పి.రాంబాబు, కీ రిసోర్స్ పర్సన్లు ఆర్.ఎన్.ప్రసాద్, నిర్మలా కుమారి, హరిణి, తాతాజీ, రమాదేవి, సుచరిత, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2023-24 0విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి పేర్కొన్నారు. అడ్మిషన్స్‌కు సంబంధించి ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 16 నుంచి 22 లోగా ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేట్ లెవెల్‌లో బీఎస్సీ ఆనర్స్ మ్యాథమెటిక్స్, బీఎస్సీ ఆనర్స్ ఫిజిక్స్, బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ ఆనర్స్ కెమిస్ట్రీ, బీఎస్సీ ఆనర్స్ బోటనీ, బీఎస్సీ ఆనర్స్ జువాలజీ, బీఎస్సీ ఆనర్స్ మైక్రోబయాలజీ, బీఏ ఆనర్స్ హిస్టరీ, బీఏ ఆనర్స్ ఎకనామిక్స్, బీఏ ఆనర్స్ పొలిటికల్ సైన్స్, బీ.కాం జనరల్, బీబీఏ లాజిస్టిక్స్, బీబీఏ హోటల్ మేనేజ్‌మెంట్, బీబీఏ హెల్త్‌కేర్, డిజిటల్ మార్కెటింగ్‌తో పాటు 12 పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ తెలుగు, ఎంఏ ఇంగ్లిషు, ఎంఏ సోషల్ వర్క్, ఎం.కాం, ఎంఎస్సీ మ్యాథమెటిక్స్, మైక్రోబయాలజీ, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించి ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7032270810, 9052297729, 9396235303 నంబర్లలో సంప్రదించాలన్నారు.